
# లాలిపాటనై ...!

- ఎనుగంటి వేణుగోపాల్

"అమ్మా !!...నేను నీ బిడ్డను కానా ...?" -అనే ఆవేదనా తరంగాలు ఉమ్మ నీటిలోంచి కెరటంలా కదలి, నా రక్త మాంసాల్లోంచి విడివడి... నా ఊపిరిలో ఊపిరై కలిసిపోయి నా అంతరంగాన్ని ఆర్తిగా ప్రశ్నిస్తోంటే...

గర్భస్థ శిశువు తన కన్నీటి ముత్యాల్తో నా



గుండెని అభిషేకిస్తున్నట్లుగా ఉంది.

ఆ పేగు బంధపు అంతర్వాణికీ... ఈ తల్లి గుండె మంచు పొరలా కరిగి, కనురెప్పల మాటు నుండి కన్నీటి అలై ఎగిసి పడుతోంది. నా హృదయవేదన సుడిగాలిలా సుడులు తిరిగి మనసు పొరల్ని ప్రకంపింపజేస్తోంది.

ఏ బంధం-అనుబంధమై, అపురూపంగా నా తనువుని చుట్టేసిందో...

ఏ రాగం-అనురాగమై, అనురక్తితో నా నరనరాల్ని శ్రుతి చేసిందో...

ఆ మాతృత్వపు మధురిమలు నా అణువణువునీ ఆవరిస్తోంటే... ఒక అనుభూతి పవనం పరిమళ భరితమై నను నిలువెల్లా స్పృశిస్తోంది.... !!

అప్యాయతతో పలకరిస్తూ నా పొత్తి కడుపుని సుతిమెత్తగా తడుముకున్నాను.

నేను-

అంతర్వత్నిని... !

నిండు గర్భిణిని... !!

కానీ ...

ఈ సృష్టిలో ఏ తల్లీ తలపెట్టని సరికొత్త ఆచారానికి శ్రీకారంగా మలచబడినదాన్ని చరిత్ర పుటల్లో పొదగబడిన కన్నతల్లుల కమనీయ వాక్యాల నడుమ ఓ కన్నీటి వాక్యాన్నై తలెత్తబోతున్న దాన్ని.

పడతి- ఏ మధుర స్వప్నం కొరకు కలవరిస్తుందో...

అమ్మా అనే పిలుపులోని మాధుర్య రసాస్వాదానికి ఉవ్విళ్ళూరుతుందో...

ఆడతనం 'అమ్మదనమై' సార్థకత పొందాలని పరితపిస్తుందో...

కన్నతల్లి అయ్యే భాగ్యానికై నోములు నోస్తుందో...

మాతృమూర్తిగా మమకార మందించాలని పలవరిస్తుందో...

ఆ మాతృత్వాన్ని అవకాశంగా చేసుకుని నా అవసరంగా మలచుకున్న... అమ్మకాని అమ్మని !

నా గర్భస్థ శిశువుకి కాలేని కన్నతల్లిని.

క... నే... త... ల్లి... ని... !!

★ ★ ★

నేను ... భర్తే దైవంగా, కుటుంబ పోషణే బాధ్యతగా... ఆ ఇంటా... ఈ ఇంటా... ఆ పనీ ఈ పనీ చేస్తూ... బ్రతుకు వెళ్ళదీస్తున్న సగటు మహిళని... !

ముగ్గురాడ పిల్లలు, అనారోగ్యపు భర్త... చితికిన ఆర్థిక స్థితి. ఇదీ ఇంటి పరిస్థితి.

నైతికమో, అనైతికమో నాకు తెలీదు కానీ నేనో కట్టుబడికి లొంగిపోయాను.

అప్పటి స్మృతి శకలం ఊపిరిపోసుకుని సజీవ దృశ్యమై నా కళ్ళముందు కదలాడసాగింది.

నేను పనిచేసే ఓ ఇంటి యజమానురాలి ముందు నా పేదరికపు గోడు వెళ్ళబోసుకున్న ఫలితమేమో, ఆ యజమాని వచ్చి ఆయన్ని కలిశాడు.

ఆయన కలిసి చెప్పిన విషయం మా ఆయన నాకు చెప్పాడు. ఇద్దరమూ బాగా ఆలోచించావు. అన్ని విధాలా చర్చించాము.

చివరికి ఆ అయ్యగారితో వెళ్ళాను. ఆయన మరో వ్యక్తి చెంతకు తీసుకెళ్ళాడు.

"నీ పేరు..." అడిగారాయన.

"సుశీల..."

"మీ అయ్యగారు చెప్పిన దానికి సమ్మతమేనా ?"

సరేనంటూ తలూపాను.

"ఇది కేవలం కృత్రిమ గర్భధారణ. నీ అండంలోకి వీర్యకణం ప్రవేశపెట్టబడుతుంది..."

ఇంకా ఏదో చెప్పబోతోంటే మధ్యలోనే అయ్యగారు అడ్డుకున్నారు.

"సర్ ! సుశీలకావిషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరించనక్కర్లేదనుకుంటా !"

"ఎనీ హౌ... చెప్పడం మన బాధ్యత కదా !" నిజాయితీ ధ్వనించిందాయన కంఠంలో.

"సుశీల చదువుకున్నదే అనుకోండి... కానీ అనవసరమేమోనని... ! ఒప్పందం గురించి చెబితే సరిపోతుంది."

"అలాగేలే !" నంటూ నా వైపు తిరిగి "చూడమ్మా ! నా సంతానానికి నీవు కేవలం తల్లివి. అంతే ! నీతో నాకు గానీ, ఈ కనబోయే బిడ్డతో నీకుగానీ ఎలాంటి బంధం-అనుబంధం ఉండదు. ఉండకూడదు కూడా !" అంటూ చెప్పాడు-మౌనంగా కళ్ళతోనే 'సరే' నన్నాను.

"మరో రకంగా చెప్పాలంటే కిరాయి తల్లివి మాత్రమే !" అన్నాడు తిరిగి.

నిలువునా ఎగిసిపడిన ఓ భావ కెరటం ఫెళ్ళున విరిగిపడి ఛెళ్ళున నా ఎదని చరిచినట్లయింది.


కి... రా... యి... త... ల్లి... ఏ !!

పాల వెన్నెల పగుళ్ళు బారినట్టు-నా మదిలో ఏ మూలో కలవరపాటు... ! అయినా అన్నీ అదిమిపెడితేనే కదా సర్వం సానుకూల మయ్యేది.

నిర్మల తటాకంలా నిశ్చలంగా ఉండిపోయాను !!

"గర్భధారణ జరిగిందని నిర్ధారణ అయిన మరుక్షణం నీవు మా సమక్షంలోనే ఉంటావు. మేమిచ్చే ఆహారమే తీసుకోవాల్సి ఉంటుంది. బిడ్డని ప్రసవించాక నీ దారి నీది-మా దారి మాది. ఆ శిశువు మీద నీకెలాంటి హక్కూ ఉండదు" చెప్పుకుపోతున్నాడాయన.

"తీరా నేను పసికందుని కన్నాక మీరా బిడ్డని స్వీకరించనంటే ?" నాలో అనాలోచితంగా ఉదయించిన సంశయం వాళ్ళ ముందు నిలిచింది.



అయ్యగారితోపాటు ఆ ఆఫీసర్ కూడా విభ్రాంతిగా నా వైపు చూశారు. బహుశా నేనలా అడుగుతానని వాళ్ళూహించి ఉండరు.

వెంటనే ఆ ఆఫీసరన్నాడు.

"అట్లా ఏం జరగదు. కాగితాల మీద మనిద్దరి సంతకాలూ ఉంటాయి. బిడ్డను కనడం వరకే నీ బాధ్యత. కళ్ళు తెరిచిన శిశువుది నా బాధ్యత. నిజానికి నేను అనాధ పిల్లల్లో ఎవరో ఒకర్ని పెంచుకుందామనుకున్నాను. కానీ నా జీన్స్‌తో పుట్టే బిడ్డయితే బాగుంటుందన్న స్వార్థంతో ఇలాంటి సరికొత్త నిర్ణయానికి నాంది పలికాను. మీ స్థితిగతుల గురించి ఈ క్లర్క్ ద్వారా తెలిశాక నాకీ ఆలోచన తట్టింది. పైగా డబ్బవసరం నీకుంది. పిల్లల ఆశ నాకుంది. ఒకరికి సాయం చేశానన్న తృప్తి మిగుల్తుంది."

పిల్లలు లేని వాడినన్న వ్యథ... ఓ పసికందుకి తండ్రినైతే బాగుండునన్న ఆకాంక్ష... ఒకేసారి ఆయన మొహంలో ప్రతిబింబించాయి.

సువిశాల గోదారమ్మ తల్లిలా నిర్మలంగా ఉండిపోయాను.

"నా మౌనం వాళ్ళలో సందిగ్ధ స్థితిని రేకెత్తించిందేమో.

"మాట్లాడవేం సుశీలా ! నీకేమైనా అనుమానం ఉంటే అడగొచ్చు. లేదూ... ఇష్టం లేకపోతే ఇప్పటికైనా మానెయ్యొచ్చు !" మా అయ్యగారన్నారు.

నాకు ఆర్థిక సాయం లభిస్తోందన్న స్వార్థ చింతనో, ఈ జీవితంలో తల్లిదండ్రులం కాలేమన్న బాధతో నలిగిపోతున్న ఆ ఆఫీసర్ దంపతుల బెంగ తీర్చబోతున్నానన్న సంతృప్తో... నన్నీ పనికి పురమాయిస్తోందన్న సంకల్పంతో ...

"అదేం లేదయ్యగారూ ! మీరెట్లా చెబితే అట్లానే... " అన్నాను.

"నాకు నీవు సంతానాన్ని కనిచ్చిన వెంటనే నీ భర్త ఆపరేషన్ ఖర్చులకి లక్ష-నీ ముగ్గురాడ పిల్లలకే ఒక్కొక్కరి పేర యాభై వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన కాగితాలు నీకు అందుతాయి" చెప్పాడా ఆఫీసర్.

ఈ స్థితి నా 'భాగ్యాని' కి హేతువో, నా 'నిర్భాగ్యా'నికి సూచనో, నాకైతే అర్థం కాలేదు. ప్రపంచంలో ఏ కన్నతల్లీ కనే తల్లిగా ఇలాంటి కిరాయి పనికి శ్రీకారం చుట్టిందో లేదో నాకు తెలీదు. కానీ నాకు మాత్రం తప్పలేదు.... తప్పని సరైంది.

నా రెక్కల కష్టంతోనే కుటుంబంలోని నలుగురికి నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళ్ళాలి. భర్తకి మందులు... ముగ్గురాడ పిల్లల అవసరాలూ... శక్తికి మించిన పనైపోతోంటే ఈ పనికి ఒప్పుకోవడం మినహా మరో మార్గం కనిపించలేదు.

అరగంటలో కాగితాలు రాయడం పూర్తయ్యాయి. ఎనిమిదవ తరగతి చదివిన జ్ఞానంతో ఆ ఒప్పందపు పత్రాన్ని ఆసాంతం చదివాను. సంకోచించకుండా సంతకం పెట్టాను.

ఓ మంచి నాటకం జీవిత భాగస్వామ్యమైతే ఫర్వాలేదు. కానీ ఓ అనూహ్య సంఘటనకి వేదికైన నాటకంలా జీవితం ససేమిరా రూపాంతరం చెందకూడదు.

ఇలా ఈ కృత్రిమ గర్భధారణ అంకానికి నాందీ ప్రస్తావన జరిగిపోయింది.

★ ★ ★

"అమ్మా !!

నీవు నా తల్లివి కాదూ ... ?"

అనే కంపనం, భూకంపమై నా అంతరంగాన్ని తుత్తునియలు చేసేస్తోంటే...

నా వెన్నముద్ద వెన్నెల మువ్వ వేదనా మూర్తియై విలపిస్తూన్నట్లనిపించింది !

గర్భస్థ శిశువు శోకశిశువై రోదిస్తున్నట్లనిపించింది !!!

తల వంచి ఉబ్బెత్తు పొట్టకేసి ఆందోళనగా చూశాను !!!

అది నా మనోభ్రాంతో అంతరంగ విభ్రాంతో తెలీదు. అయినా 'కనే' తల్లిగా నేనెలా చరిత్రలో మిగిలిపోగలను ? కన్నతల్లినై కరిగిపోనూ !

శిశువు 'కన్నీటి చారికై' నా హృదిపటలాన్ని కదిలిస్తోంటే నా కంటి చూపు హరివిల్లై ఎలా విరుస్తుంది... ??

వెలుగురేఖలు రెక్కలు చాస్తూ వేకువ వస్తోంటే-ఓ నీలి తెర వైదొలిగినట్టు... మబ్బు తునక అడ్డు తొలిగినట్టు ... నా నిర్ణయంలో ఓ నిర్ణయాత్మకమైన మార్పు ఊపిరి పోసుకుంది.

మురిపెంగా పొట్టకేసి చూసుకున్నాను.

డేగ జాడ తెలిసి భయవిహ్వలతో తల్లిరెక్కల మాటున ఒత్తిగిల్లిన గువ్వలా, నా గర్భకోశంలో గర్భస్థ శిశువు ముడుచుకున్నట్లనిపించింది. లాలనగా పొత్తి కడుపు నిమిరాను.

ఏ జన్మ బంధమో ఈ పేగు బంధం నను కట్టేస్తోంది !

నా చిట్టి తల్లీ (తండ్రీ) !

నీవు నా బిడ్డవే నమ్మా (నయ్యా). నీ ఎదను కందిపోనివ్వను సుమ్మీ ! నీ కనుపాపలు కన్నీరై కరగనివ్వను.

ఒరేయ్ కన్నా-నా చిట్టితల్లీ !

నీకు నా రక్త మాంసాలు పంచిచ్చిన దాన్ని... మరొకరికి నిన్ను పెంచడానికివ్వను.

బీజం మరొకరిదా కావొచ్చు. కానీ నా గర్భ క్షేత్రంలో అంకురించబోతున్న మొలకవి.

మమకారపు ముద్దనై... నీకు ముద్దులు పెడతా !

నా గుండె కుదిపి ... మురిపాల నందిస్తా... !

అమావాస్య బారిన పడితేనేం... పౌర్ణమి వెన్నలై తిరిగొస్తుంది జాబిలమ్మ ! సమస్యల వలయాలు చుడితేనేం... చల్లని తల్లినై నీ బోసినవ్వుల సాంగత్యాన్ని స్పృశిస్తా !

నీ తప్పటడుగుల తాళాలకి ... నే లాలిపాటనై పల్లవిస్తా...

-పసిపాపని బుజ్జగించడమయ్యాక నా నిర్ణయాత్మక ఆలోచనల్ని కాగితం మీద పెట్టడమారంభించాను...

★ ★ ★

స్తంభించిన జీవన గతుల్ని డబ్బు గమింపచేస్తుందేమో కానీ, కన్న ప్రేమ వెలకట్టలేని జీవిత మాధుర్యానికి ఊపిరిపోస్తుంది. రక్తసంబంధం జన్మ జన్మల అనుబంధాల్ని ఆవిష్కరిస్తుంది.

అందుకే నా మాటని వెనక్కి తీసేసుకుంటున్నాను. మాట తప్పుతున్నందుకు మన్నించండి.

మన చేతి రాత కాగితాల్ని తలరాత జీవితాలుగా మలచలేక చెత్తకాగితాలుగా మార్చేస్తూ తిరిగి మీకు పంపిస్తున్నాను. నాకే డబ్బూ వొద్దూ... ! కళ్ళు తెరవకుండానే... నా కళ్ళు తెరిపించిన నా పసిగుడ్డు నాకే కావాలి. నా శ్వాసని నాలోంచి వేరు చేసి ... మీకందివ్వలేను.'

'కనే తల్లి' గా కాకుండా...

నన్ను 'కన్న తల్లి' గా నే చరిత్ర పుటల్లో మిగలనీయండి !

'తల్లి మనసు' ని అర్థం చేసుకుంటారని ఆశిస్తూ ...

-మాతృత్వానికి తలొగ్గిన మాతృమూర్తి.